andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.8 । కనిష్ఠం 24.9
నిర్మల్ జిల్లా వార్తలు
8
శుక్రవారం 13 సెప్టెంబరు 2024



పల్లెలకు అటవీ అనుమతుల శాపం





లక్ష్మణచాంద మండలంలో రాచాపూర్ గ్రామం వద్ద సిమెంట్ లైనింగ్ తొలగిపోయిన దృశ్యం

» కాలువలు, రోడ్లు, వంతెనల మరమ్మతులకు బ్రేక్
» అడుగడుగునా కవ్వాల్ అభయారణ్య నిబంధనలు అడ్డు
» కడెం, సరస్వతీ కాలువల పరిస్థితి దయనీయం
» వర్షాన్ని తలుచుకొని భయపడుతున్న ఆదివాసీలు
» కాగితాలకే పరిమితమవుతున్న అధికారుల ప్రతిపాదనలు

నిర్మల్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని కడెం ప్రధాన కాలువ మరమ్మతులకు అటవీశాఖ అనుమతులు శాపంగా మారుతున్నాయి. మొన్నటిభారీ వరదల కారణంగా అనేక చోట్ల కాలువకు గండ్లు పడడం, అలాగే కాలువలో పిచ్చిమొక్కలు మొలవడం సమస్యగా మారింది. దీనికి తోడు పలు మారుమూల గ్రామాలను కలిపే వంతెనలు తెగిపోవడం, రోడ్లు చెడిపోవడం లాంటి విధ్వంసం చేసుకుంది. ఈ ప్రధాన కాలువ మరమ్మతులకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించినప్పటికీ కాలువ భాగమంతా కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలో ఉండడం ప్రధాన ఆటంకంగా మారింది. కాలువ లైనింగ్ పూర్తిగా భారీ వర్షాలతో ధ్వంసం అయ్యింది. ఈ కాలువ కవ్వాల్ అభయారణ్యం పరిధిలో ఉన్నందున మరమ్మతులకు అటవీశాఖ అనుమతులను నిరాకరిస్తుంది. 35 ఏళ్ల క్రితమే ఈ కాలువ నిర్మాణానికి అటవీశాఖ అనుమతులిచ్చినప్పటికీ ప్రస్తుతం మాత్రం మరమ్మతుల పనులకు కవ్వాల్ టైగర్ జోన్ నిబంధనలు అడ్డుపడుతుండడం ఆటంకాలకు తావిస్తోంది. కాలువ లైనింగ్ పూర్తిగా ధ్వంసం అవ్వడం అలాగే కాలువలో వరదల కారణంగా మట్టి పెద్ద ఎత్తున చేరుకోవడం, లైనింగ్ మధ్యలో పెద్ద పెద్ద చెట్లు మొలవడం, పిచ్చిమొక్కలు విస్తరించడంతో ఈ కాలువ రూపురేఖలే మారిపోయాయి. అలాగే జిల్లాలోని మరో ప్రధాన కాలువైన సరస్వతీ కాలువ పరిస్థితి కూడా దయనీయంగానే ఉంది. ముఖ్యంగా ఖానాపూర్ పరిధిలో కవ్వాల్ టైగర్‌జోన్ నిబంధనలు అమలవుతున్న కారణంగా ఈ కాలువ మరమ్మతులు చేయలేకపోతున్నారు. మరమతు పనులు జరగకపోవడంతో కడెం, సరస్వతీ కాలువల నుంచి పంటలకు ఈ సారి ఖరీఫ్‌లో పూర్తిస్థాయిలో నీరందడం కష్టమేనంటున్నారు.

పసుపుల వంతెనపై స్పందన కరువు

మారుమూల పెంబి మండలంలోని పసుపుల వంతెన మొన్నటి వరదల కారణంగా పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ వంతెన ఆరు ఆదివాసీ గ్రామ పంచాయతీలకు ప్రధాన రోడ్డు మార్గం ఉండేది. అయితే నాణ్యత లోపం కారణంగా మొన్నటి వరదలతో ఒక్కసారిగా కుప్పకూలి పోయింది. ఇప్పటి వరకు ఈ వంతెనను పునర్ నిర్మించలేదు. దీంతో ఈ వర్షకాలంలో ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందంటున్నారు. ఈ వంతెన నిర్మాణానికి కూడా అటవీశాఖ అనుమతులు తప్పనిసరి అంటున్నారు. ఇప్పటి వరకు అటవీశాఖ మాత్రం పూర్తిస్థాయిలో వంతెన నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయలేదు. ఈ వంతెన నిర్మాణం ఇక ఇప్పట్లో సాధ్యం కాదంటున్నారు. అలాగే కడెంనదిపై నిర్మిస్తున్న వంతెన కూడా వరదల కారణంగా కొట్టుకుపోయింది. దీనికి కూడా అనుమతులు గాని టెండర్ ప్రక్రియ గాని పూర్తికాకపోవడంతో ఇక ఈ వర్షకాలంలో పనులు పూర్తికావడం సాధ్యం కాదంటున్నారు. దీంతో ఆదివాసీ గ్రామాలకు రాకపోకలు స్థంభించే అవకాశం ఏర్పడుతుందంటున్నారు.

మారుమూల రోడ్లదీ అదే పరిస్థితి

మొన్నటి వరదల కారణంగా జిల్లాలోని అనేక మారుమూల గిరిజన గ్రామాల రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. అయితే కవ్వాల్ టైగర్ జోన్ నిబంధనల ప్రకారం అటవీశాఖ అనుమతులు తప్పనిసరి కావడంతో ఈ రోడ్డు మరమ్మతులు ఇప్పటి వరకు మొదలుపెట్టలేదు. ముఖ్యంగా పెంబి మండలంలోని రాంనగర్, దొంధరి, వట్టపెల్లి, గమ్మెన ఎంగ్లాపూర్, పసుపుల తదితర గ్రామాల రోడ్ల పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. అయితే పనులు మొదలు కాకపోవడంతో ఈ వర్షకాలంలో సైతం రోడ్లపై నడవడం సాధ్యం కాదని పలువురు అంటున్నారు.





అటవీ అనుమతులకు నోచుకొని సిరిచెల్మ రోడ్డు దృశ్యాలు

వినాయకుడికి 108 రకాల నైవేద్యాలు



స్వామి వారి ముందు 108 నైవేద్యాలు

నిర్మల్, సెప్టెంబరు 12 : నిర్మల్ జిల్లా కేంద్రంలో గణపతి నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. నిర్మల్ పట్టణంలోని గాంధీనగర్ మర్రిచెట్టు హనుమాన్ ఆలయంలో నాగాంజనేయ వినాయకకమిటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం వినాయక చవితి సందర్భంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. కాగా ఐదవరోజు భక్తులు వినాయకుడికి భారీ నైవేద్యాన్ని సమర్పించారు. 108 రకాల పిండి వంటలు, స్వీట్లను స్వామివారి ముందు ఉంచారు. మా గణపయ్య ఉండ్రాళ్లు ఒకటే కాదు ఎన్నో రకరకాల స్వీట్లను, పిండి వంటలను ఆరగిస్తాడు అనే విధంగా భారీ నైవేద్యాన్ని ఏర్పాటు చేశారు. గణపతిపూజ అయిన అనంతరం వచ్చిన భక్తులందరికీ 108 రకాల ఇంటి వంటలు కలిసిన భారీ నైవేద్యాన్ని భక్తులకు ప్రసాదంగా పంచారు. ఈ సందర్భంగా పూజారి, అలాగే నిర్వాహ కులు, మహిళలు మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాల నుంచి మర్రిచెట్టు హనుమాన్ ఆలయం వద్ద వినాయక చవితి సందర్భంగా గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. గణనాథుడికి ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నామని అందులో ఐదవరోజు స్వామివారికి అత్యంత భారీ నైవేద్యాన్ని సమర్పించాలనే ఆలోచనతోనే అందరం కలిసి 108 రకాల పిండి వంటలు, స్వీట్లతో భారీ నైవేద్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగాంజనేయ యూత్ సభ్యులు, మహిళలు, పెద్ద పాల్గొన్నారు.

రూ.67 వేలు పలికిన విద్యుత్‌శాఖ గణేష్ మండలి లడ్డు

భైంసా, సెప్టెంబరు 12 : పట్టణంలోని వివిధ గణేష్ మండలిల లడ్డు వేలం పాటలు పోటాపోటీగా కొనసాగుతున్నాయి. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం వద్ద గురువారం లడ్డు వేలం పాటలు జరిగాయి. ఇందులో విద్యుత్ ఎంప్లాయిస్ ఈఆర్‌వో సెక్షన్ నిర్వాహక అధికారులు, సిబ్బంది రూ.67 వేలతో లడ్డును కైవసం చేసుకున్నారు. ఇందులో కుమారస్వామి, రాజశేఖర్, మచ్చేందర్, ముఖేష్ కుమార్‌లు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల మార్పుపై రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై మండిపడ్డ బీజేపీ

● జిల్లా కేంద్రంలో దిష్టిబొమ్మ దహనం



రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 12 : అమెరికా పర్యటనలో భాగంగా రాహుల్ గాంధీ రిజర్వేషన్ల మార్పుపై చేసిన వ్యాఖ్యలపై బీజేపీ మండిపడింది. గురువారం రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను ఆ పార్టీ శ్రేణులు దహనం చేశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య మాట్లాడుతూ... రిజర్వేషన్ల మార్పు విషయం ఆలోచిస్తున్నామని రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు యావత్ దళితజాతికి నష్టం కలిగించే విధంగా ఉన్నాయన్నారు. నాయకులు ఆడెపు సుధాకర్, మేడిసెమ్మె రాజు, రాచకొండ సాగర్, అయ్యన్నగారి రాజేందర్, నరేంద్రచారి, కే. శ్రావణ్, అల్లం భాస్కర్, నరేష్, దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల మధ్య ఘర్షణ

● డయల్ 100 కు సమాచారం ● శాంతింపజేసిన పోలీసులు
● అధికారులకు సీనియర్, జూనియర్ విద్యార్థుల ఫిర్యాదులు

బాసర, సెప్టెంబరు, 12 : బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. బుధవారం రాత్రి గొడవను పోలీసులు సకాలంలో స్పందించి శాంతింపజేశారు. తెలిసిన వివరాల ప్రకారం యూనివర్సిటీలో వివిధ విభాగాల ఆధ్వర్యంలో వినాయక ఉత్సవాలను నిర్వహిస్తారు. బుధవారం ఒకరి వినాయక నిమజ్జన ఊరేగింపు సందర్భంగా అక్కడికి చేరుకున్న విద్యార్థులు నృత్యాలు చేశారు. ఈ క్రమంలో ఇంజనీరింగ్ మూడవ, నాల్గవ సంవత్సరం చదివే విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. వెంటనే అక్కడున్న వారు డయల్ 100 కు సమాచారం అందించడంతో హుటాహుటిన పోలీసులు వచ్చి విద్యార్థులను శాంతింపజేశారు. అనంతరం గురువారం ఇరువర్గాలకు చెందిన విద్యార్థులు ఒకరిపై ఒకరు యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేసుకున్నారు. అంతర్గత విచారణ చేపట్టి చర్యలు తీసుకునేందుకు యూనివర్సిటీ అధికారులు విచారణ ప్రారంభించారు. ఈ విషయంపై యూనివర్సిటీ అధికారులను సంప్రదించే ప్రయత్నం చేయగా ఎవరూ కూడా అందుబాటులోకి రాలేదు. ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల మధ్య గొడవ విషయం 100 డయల్ కు ఫిర్యాదు రాగానే వెంటనే వెళ్లినట్లు బాసర ఎస్సై గణేష్ తెలిపారు. ఈ ఘటనపై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 12 : బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను గురువారం హైదరాబాద్‌లోని సంక్షేమ భవనంలో మోకుదెబ్బ రాష్ట్ర కమిటీ సభ్యులు సన్మానించారు. జాతీయ అధ్యక్షుడు అమరవేణి నర్సాగౌడ్, అధికార ప్రతినిధి బాలసాని సురేష్‌గౌడ్, రవీందర్‌గౌడ్, నాగేశ్వర్‌రావు గౌడ్, అనుముల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 12 : నిర్మల్ పట్టణం గాంధీ నగర్ నాగాంజనేయ గణేష్ కమిటీ సభ్యులు గురువారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్‌ను సన్మానించారు. మర్యాదపూర్వకంగా కలిశారు. నిర్మల్ గణేష్ ఉత్సవ కమిటీ ఈ మండలికి 46 నెంబర్ కేటాయించింది. వరప్రసాద్, రాజు, తేజ, నిఖిల్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు

సోన్ రూరల్, సెప్టెంబరు 12 : మండలంలోని బొప్పారం గ్రామంలో గురువారం మండల బీజేపీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అపూర్వ ఆదరణ లభిస్తుందని పార్టీ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గంగన్న, సాగర్, మార గంగారెడ్డి, భూమారెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ముథోల్, సెప్టెంబరు 12 : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం జరిగిన జిల్లా స్థాయి సెలక్షన్స్‌లలో ముథోల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు అమీర్ ఖుస్రో, పీడీ శ్రీనివాస్‌లు తెలిపారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

● కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, సెప్టెంబరు 12 : సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్టచర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవలసిన చర్యలపై మండలాల వారీగా వైద్య, ఆరోగ్య, పంచాయతీరాజ్‌శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నమోదైన డెంగ్యూ కేసులు, సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం చేపడుతున్న ముందస్తు జాగ్రత్తలు, పీహెచ్‌సీలు, ఆసుపత్రులలో వైద్యులు, సిబ్బంది హాజరు, అందుబాటులో ఉన్న మందులు, వ్యాధుల నియంత్రణకు ప్రజలకు కల్పిస్తున్న అవగాహన కార్యక్రమాలు తదితర అంశాలపై మండలాల వారీగా ఎంపీడీవోలు, వైద్యాధికారులతో సమీక్షించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్టచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్య, ఆరోగ్య శాఖ పనితీరును మరింతగా పటిష్ట పరచి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని అధికారులను సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రోజు వారీగా నమోదవుతున్న సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వైద్యులు, సిబ్బంది ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాలని సూచించారు. వ్యాధుల నియంత్రణకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పంచాయతీ, అంగన్‌వాడీ, ఆశ, వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి వ్యాధుల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సబ్‌సెంటర్లలో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండి డెంగ్యే, మలేరియా, టైఫాయిడ్, చికెన్ గున్యా వంటి రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలన్నారు. ఆసుపత్రుల వారీగా వైద్యుల హాజరు, పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, ఆసుపత్రులలోని ఆయా విభాగాలు, ఔషధాల నిలువ, స్టోర్ రూమ్, రోగుల ఇన్ పేషెంట్ వార్డు, ల్యాబ్ తదితర నమోదు రిజిస్టర్లను నిరంతరం పరిశీలించాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్లను ఎంపీడీవోలు, మండల వైద్యాధికారులు నిరంతరం సందర్శించి, వ్యాధుల నియంత్రణ, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి రక్తహీనత లోపాన్ని నివారించేందుకు గర్భిణీలు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ అంకితభావంతో సేవలు అందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు, వైద్యులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డా. రాజేందర్, జిల్లా పరిషత్ సీఈవో గోవింద్, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ సునీల్‌కుమార్, నిర్మల్, భైంసా మున్సిపల్ కమిషనర్లు రాజు, రాజేందర్ కుమార్, పంచాయతీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవాన్ని శాంతియుతంగా జరుపుకోవాలి

● ఎస్పీ డా. జానకిషర్మిల ● సార్వజనిక్ గణపతికి పూజలు చేసిన జిల్లా ఎస్పీ ● నిమజ్జనంకు రూట్‌మ్యాప్ పరిశీలన ● ముథోల్‌లో నేడు నిమజ్జనోత్సవం



రాంమందిర్‌లో సార్వజనిక్ గణేష్‌కు పూజలు చేస్తున్న ఎస్పీ

ముథోల్, సెప్టెంబరు 12 : మండల కేంద్రమైన ముథోల్‌లో శుక్రవారం గణేష్ నిమజ్జనం జరుగనున్న నేపథ్యంలో గురువారం శోభాయాత్ర జరుగనున్న రూట్ మ్యాప్‌ను జిల్లా ఎస్పీ డా.జానకీషర్మిల పరిశీలించారు. భైంసా అడిషనల్ ఎస్పీ అవినాష్‌కుమార్, సీఐ మల్లేష్, ఎస్సై సాయికిరణ్‌లకు పలు సలహా, సూచనలను ఇచ్చారు. అనంతరం ముథోల్‌లోని రాంమందిరంలో ఏర్పాటు చేసిన సార్వజనిక్ గణేష్ మండపం వద్ద ఎస్పీ ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. గురువారం జరిగే నిమజ్జనోత్సవంకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా 200ల మంది పోలీసులు బందోబస్తు చేయడం జరుగుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనోత్సవం జరుపుకోవాలన్నారు. శుక్రవారం ముథోల్‌లో గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ చర్యలను చేపట్టామని, అందరూ ప్రశాంత నిమజ్జనానికి సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు. ముథోల్‌లో గణేష్ శోభాయాత్ర వెళ్లే మార్గాలను ఎస్పీ పరిశీలించారు. పోలీసుల సూచనలకు అనుగుణంగా నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు నడుచుకొని ప్రశాంతంగా నిమజ్జనం పూర్తి అయ్యేలా సహాయ సహకారాలు అందించాలని కోరారు. నిమజ్జనం అంతా ప్రశాంత వాతావరణంలో పూర్తి అయ్యేలా భద్రతపరమైన అన్ని చర్యలను చేపట్టామని, స్థానిక గజ ఈతగాళ్లను నిమజ్జన ప్రాంతంలో అందుబాటులో ఉంచామని, శోభాయాత్ర వెళ్లే మార్గంలో ఇతర శాఖల సమన్వయంతో ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా పటిష్టమైన చర్యలను తీసుకుంటున్నామని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా అధిక సౌండ్ ఇచ్చే డీజేలు, బాణాసంచా కాల్చడం వంటివి చేయరాదని తెలిపారు. ముఖ్యంగా యువకులు నిమజ్జనం సమయంలో సంయమనం పాటించాలని, ఊరిలోని పెద్దలు పిల్లలకు తెలియజేసి ఆదర్శంగా నిలవాలని తెలిపారు. చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని, చట్టానికి లోబడి నడుచుకోవాలని తెలిపారు. చట్టానికి విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక నిమజ్జనాన్ని శాంతియుతంగా, సామరస్యంగా జరుపుకోవాలని అందుకు ప్రజలు పూర్తిగా పోలీసు వారికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అవినాష్‌కుమార్, సీఐ మల్లేష్, ఎస్సై సాయికిరణ్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రోళ్ల రమేష్, గౌరవ అధ్యక్షుడు సుదర్శన్, సభ్యులు కోరి పోతన్న తాటివార్ రమేష్, సాయినాథ్, మోహన్ యాదవ్, జి. నారాయణ, ధర్మేందర్ దేశ్‌ముఖ్, పూజారి ముధకర్, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు సన్మార్గంలో పయనిస్తూ నైతిక విలువలు పెంచుకోవాలి

● భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్

భైంసా, సెప్టెంబరు 12 : విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్ కోసం గాను సన్మార్గంలో పయనిస్తూ నైతిక విలువలు పెంపొందించుకోవాలని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక నర్సింహ కల్యాణ మండపంలో భైంసా హిందూ ఉత్సవ సమితి సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పోటీల విజేతల బహుమతి పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నేటి పోటీతత్వ యుగంలో రాణించేందుకు విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ జీవిత లక్ష్య సాధనకు ముందుకు సాగాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థి లోకం దైవభక్తి, దేశభక్తి పెంపొందించుకోవాలన్నారు. ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ రాజులవార్ దిగంబర్ మాట్లాడుతూ పాశ్చత్యధోరణి విధానాలు, ఆధునిక పోకడల మూలంగా దెబ్బతింటున్న సంస్కృతి,సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు పూర్వవైభవం తీసుకవచ్చే దిశగా విద్యార్థులు చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. వివిధ ప్రతిభా పోటీల్లోని విజేతలకు బహుమతి పంపిణీ చేపట్టారు. ఇందులో టౌన్ సీఐ రాజారెడ్డి, భైంసా హిందూ ఉత్సవ సమితి అధ్యక్షులు పెండెపు కాశీనాథ్, సాంస్కృతిక విభాగం కన్వీనర్ పురస్తు గోపాల్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముత్యంరెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరారించాయి.

సంక్షిప్త సమాచారం

బాలికను మోసగించిన నేరస్తుడికి 20 ఏళ్ల కఠిన జైలు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 12 : ప్రేమ పేరుతో మైనర్ బాలికను పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన నేరస్తుడు చాంద్‌కుమార్‌కు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 1500లు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, పోక్సో ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ జడ్జి ఏ. కర్ణ కుమార్ తీర్పునిచ్చినట్టు డీఎస్పీ గంగారెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన దుర్గే బాలాజీ ఖానాపూర్ మండలం తర్లపాడ్ గ్రామంలో భార్య పిల్లలతో నివాసం ఉంటూ ఇటుక బట్టీలో కూలీ పని చేస్తూ జీవనం గడుపుతుండేవాడన్నారు. నిందితుడు మధ్యప్రదేశ్‌కు చెందిన చాంద్‌కుమార్ మారవి అతనితో కలిసి కూలీ పని చేసేవాడన్నారు. దుర్గే బాలాజీ కుమార్తెకు ప్రేమిస్తున్నానని మాయ మాటలు చెప్పి శారీరకంగా అనుభవించాడని తెలిపారు. పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడన్నారు. తరువాత పథకం ప్రకారం నిందితుడు మైనర్ బాలికను కిడ్నాప్ చేసి మధ్యప్రదేశ్‌కు తీసుకెళ్లి నిర్బంధించి అనేకసార్లు వాంఛ తీర్చుకున్నాడని పేర్కొన్నారు. బాలాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరిపి అరెస్ట్ చేశామని తెలిపారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.విశ్వాస్‌రెడ్డి 15 మంది సాక్షులను విచారించగా నేరం రుజువైందన్నారు. అప్పటి డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి, ప్రస్తుత డీఎస్పీ గంగారెడ్డి, కోర్టు సమన్వయ అధికారి డల్లు సింగ్, ఏఎస్సై శ్రీనివాస్‌లను ఎస్పీ జానకి అభినందించారు.

రోడ్డు విస్తరణ పనులపై సర్వే

ముథోల్, సెప్టెంబరు 12 : ముథోల్ మండలంలోని తరోడా, న్యూ ముద్గల్ గ్రామం దగ్గర జాతీయ రహదారి 161 బాసర - భైంసా విస్తరణ పనుల్లో ఇళ్లు కోల్పోతున్న వాటిపై సర్వే నిర్వహించారు. తరోడా గ్రామంలో తహసీల్దార్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణలో కోల్పోతున్న ఇళ్లు, స్థలాలను రెవెన్యూ అధికారులు గుర్తించారు. పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ విలాస్, ఆర్ఐ నారాయణ రావు పటేల్, మాజీ సర్పంచ్ అరిపోద్దిన్, స్థానికులు, సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ



ముథోల్, సెప్టెంబరు 12 : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం తహసీల్దార్ శ్రీకాంత్ తనిఖీ చేశారు. పాఠశాలలో పలువురు విద్యార్థులు చర్మవ్యాధులతో బాధపడుతుండటంతో వారికి మంచి వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. వసతి గృహంలో పరిశుభ్రత పాటించాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే స్పందించాలన్నారు. పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సూర్యనగర్ గ్రామస్తులు

భోథ్, సెప్టెంబరు 12 : మండలంలోని సూర్యనగర్ గ్రామానికి చెందిన పెద్దలు గురువారం శాసనసభ్యులు ఆయన నివాసంలో కలిసి గ్రామ సమస్యలను విన్నవించారు. సూర్యనగర్ గ్రామంలో సేవాలాల్ మందిరం నిర్మాణానికి ప్రభుత్వం పది లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిం దని, అందులో ఐదు లక్షల రూపాయలు ఇంత వరకు రాలేదని వివరిం చారు. స్పందించిన ఎమ్మెల్యే గ్రామ సమస్యలతో పాటు మందిరానికి రావా ల్సిన డబ్బులు ఇప్పించడం జరుగుతుందని వారికి వివరించారు. కార్య క్రమంలో గ్రామపెద్దలు డి.గుండెరావు, డి.రమేష్, జె.విఠల్, జే.గోపిచంద్, పవర్, శ్యామ్‌రావు, శ్రీని వాసులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యునికి గొల్ల కురుమల సమస్యలపై వినతి

భోథ్, సెప్టెంబరు 12 : ఆదిలాబాద్ జిల్లాలో ఉన్న గొల్ల కురుమల సమస్యలను పరిష్కరించే విధంగా చొరవ చూపించాలని రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్‌కు ఆదిలాబాద్ జిల్లా గొల్ల కురుమల వర్కింగ్ ప్రెసిడెంట్ జి.రాజు యాదవ్ విన్నవించారు. జిల్లాలో త్వరలో చేపట్టబోయే గొల్ల కురుమల సమావేశానికి రావాలని కోరడం జరిగిందన్నారు. ఈ సం దర్భంగా రాజ్యసభ సభ్యుడిని సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో గిరిజనుడికి తీవ్ర గాయాలు

ఉట్నూర్, సెప్టెంబరు 12 : మండలంలోని కుమ్మరితండా సమీపంలో జరిగిన రోడ్డుప్రమాదంలో తాండ్ర గ్రామానికి చెందిన గిరిజనుడు గేడం పున్నా రావుకు తీవ్రగాయాలయ్యాయి. కుమ్మరి తండా సమీపంలో ద్విచక్ర వాహనం పై వెళ్తున్న పున్నరావు ముందుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీ కొట్టి పడిపోయినట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఆదిలాబాద్ వైపు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్ రితేష్ స్పందించి వెంటనే 108కు ఫోన్‌చేశారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

ఇరు వర్గాల ఘర్షణ : పలువురి పై కేసు నమోదు

నేరడిగొండ, సెప్టెంబరు 12: మండలంలోని కోర్టికల్ గ్రామంలో బుధ వారం రాత్రి ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోగా 20 మంది పై కేసునమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వినాయక నిమజ్జనం సందర్భంగా చెలరేగిన ఘర్షణలో ఒకరికొకరు దూషించుకుని కపుర్‌సింగ్, మేర్‌సింగ్‌లకు తీవ్రగాయాలుకాగా చికిత్స నిమిత్తం నిర్మల్ ఆసుపత్రికి తరలించి సంఘటన స్థలాన్ని సీఐ భీమేష్, ఎస్సై శ్రీకాంత్‌లు కలిసి పరిశీలించారు.

విద్యుత్ తీగలు సరిచేసిన అధికారులు

భోథ్, సెప్టెంబరు 12 : మండలంలోని కౌటా(బి) గ్రామంలో విద్యుత్ తీగలు వేలాడుతుండటంతో సమస్యను అధికారుల దృష్టికి గ్రామస్తులు తీసుకురావడం జరిగింది. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు గురువారం గ్రామంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు సరి చేశారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని సిబ్బందికి తెలపడంతో వాటిని సరి చేశారు.

రేషన్ డీలర్ సమయపాలన పాటించాలి

భోథ్, సెప్టెంబరు 12 : రేషన్ డీలర్‌లు సమయ పాలన పాటించి లబ్ది దారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని బోథ్ తహసీల్దార్ సుభాష్ చంద్ర పేర్కొన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క లబ్ది దారునికి రేషన్ బియ్యం ఇచ్చే చూడాలన్నారు. బియ్యం పంపిణీలో అక్ర మాలకు పాల్పడవద్దని ఫిర్యాదులు వస్తే తక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎన్‌ఫోర్సుమెంట్ జాదవ్ రామారావు, డిప్యూటీ తహ సీల్దార్ మల్లేష్, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

ఉట్నూర్, సెప్టెంబరు 12 : ఉట్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, చైతన్య జూనియర్ కళాశాలల్లో గురువారం బ్రహ్మాకుమారి మఠం ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల విని యోగం పై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బ్రహ్మకుమారి మఠం వారు నషాముక్త్ భారత్ అభియాన్ అనే సెంట్రల్ గవర్నమెంట్ నిర్వ హిస్తున్న కార్యక్రమంలో భాగంగా విద్యార్థులలోని మాదకద్రవ్యాలు, పొగా కు మందు వ్యసనాల అలవాటును మానిపించడానికి ఏర్పా టు చేసిన కార్యక్రమంలో సిస్టర్ మనీషా మత్తుపదార్థాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు బోధించారు. వారితో పాటు సిస్టర్‌పుష్ప, సిస్టర్ సారిక, సిస్టర్ శ్రేష్ఠ, వారి సిబ్బంది విద్యార్థులకు మత్తుపదార్థాలపై గల నష్టాన్ని అవ గాహన చేశారు. ప్రిన్సిపల్ ధన్‌రాజు పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఎన్ ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ లక్ష్మణ్, అధ్యాపకులు శ్రీనివాస్, సువర్ణ శ్రీలత, గణేష్, వినోద్, తిరుపతి, సుజాత, కిషోర్, మల్లేష్, శంకర్, చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాష్, వైస్‌ప్రిన్సిపాల్ పొదిల అనిత విద్యార్థులు పాల్గొన్నారు.

స్లాబ్ పెచ్చులు పడి తీవ్రగాయాలు

లక్ష్మణచాంద, సెప్టెంబరు 12 : మండల కేంద్రానికి చెందిన బొజ్జ పెద్ద రాజన్న అనే రైతుపై స్లాబ్ పెచ్చులు ఊడి పడి పక్కటెముకలు విరిగిన సంఘటన గురువారం తెలిసింది. మాజీసర్పంచ్ సురకంటి ముత్యం రెడ్డి, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం రాజన్న తన ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో స్లాబ్‌కు కింది నుంచి వేసిన సిమెంట్ ప్లాస్టింగ్‌కు సంబంధించిన పెద్దపెద్ద ముక్కలు అతనిపై పడటంతో తీవ్ర గాయాల పాలైయ్యాడు. ఈ ఘటనలో పక్కటెముకలు విరగటంతో చికిత్స నిమిత్తం నిర్మల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించింది. దీంతో మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు తరలించారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'

నర్సాపూర్(జి), సెప్టెంబరు 12 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం పీఆర్‌టీయూఎస్ మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు తెలిపారు. నూతన మండల అధ్యక్షుడిగా పచ్చకాంతుల గంగాచరణ్, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడిగా కొండమడుగు గంగాధర్, ఉపాధ్యక్షుడిగా పూదరి శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షులుగా పావనిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పేర్కొన్నారు. ఎన్నికైన సభ్యులను శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రామాల అభివృద్ధియే ధ్యేయం : మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

తానూర్, సెప్టెంబరు 12 : కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధియే ధ్యేయంగా ముందుకుసాగుతుందని ముథోల్ నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. తానూర్ మండలంలోని పలు గ్రామాల అభివృద్ధికి సుమారు రూ. 20లక్షల పైన నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించి ప్రసిడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వే జీఎంను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌అర్బన్, సెప్టెంబరు 12: సికింద్రాబాద్‌లోని రైల్‌నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్‌మేనేజర్‌ని ఆదిలాబాద్ ఎంపీ గోడంనగేష్, సిర్పూర్ శాసనసభ్యులు డా.పాల్వాయి హరీష్‌బాబులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీఎంకు జిల్లాలోని రైల్వేకు సంబంధించిన పలు ప్రతిపాదనలు సమర్పించారు. అలాగే త్వరలో ప్రారంభించనున్న సికింద్రాబాద్-నాగపూర్ వందే భారత్‌రైలు హాల్టును సిర్పూర్ కాగజ్‌నగర్‌లో ఉండేటట్లు చూడాలని కోరడం జరిగిందని తెలిపారు. దీనికి జీఎం సానుకూలంగా స్పందించి త్వరలో ఆ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.

వేతనాలు రాక ఇబ్బందులు

భోథ్, సెప్టెంబరు 12 : మండలంలోని వివిధ గ్రామాల్లో పని చేస్తున్న ఆరు గ్రామాల కార్యదర్శులకు వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఔట్‌సోర్సింగ్ ద్వారా నియామకం జరిగిన కార్యదర్శులు జిల్లాలో 36 మంది ఉన్నారని, వీరందరికీ వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని కార్యదర్శులు పేర్కొన్నారు.

'నిబంధనల ప్రకారం పనిచేయాలి'

నేరడిగొండ, సెప్టెంబరు 12: మండలంలోని రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని తహసీల్దార్ కలీం అన్నారు. గురువారం రేషన్ డీలర్లతో సమావేశం కాగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ప్రతి ఒక లబ్దిదారులకు చేరేలా చూడాలని ఆదేశించారు. రేషన్ షాపులలో సమయ పాలన పాటించాలని అన్నారు. ఇందులో డీటీ మహేశ్, రామారావ్, ఆర్ఐ నాగోరావ్, రేషన్ డీలర్లు ఉన్నారు.

గణేష్ మండపంలో కుంకుమపూజలు

ఉట్నూర్, సెప్టెంబరు 12: మండలంలోని నాగాపూర్‌లో నెలకొల్పిన గణేష్ మండపంలో గురువారం మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా ప్రతియేటా నిర్వహిస్తున్నట్లుగానే మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారని గ్రామస్థులు కందూకూరి రమేష్ తెలిపారు. పూజారి రమాకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుంకుమ పూజల కార్యక్రమానికి 20 మంది మహిళలు హాజరయ్యారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌ను అభినందించిన నాయకులు

జైనథ్, సెప్టెంబరు 12: జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియామకమైన అల్లూరి అశోక్‌రెడ్డిని గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి లోక ప్రవీణ్‌రెడ్డి పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎళ్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు.















హైడ్రా పేరుతో విలేకరినంటూ బెదిరింపులు

» బాధితుడి ఫిర్యాదు.. నిందితుడి అరెస్టు

పటాన్‌చెరు, సెప్టెంబరు 12: తాను పత్రికా విలేకరినంటూ డబ్బుల కోసం బిల్డర్‌పై బెదిరింపులకు పాల్పడుతున్న ఒకరిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. హైదరాబాద్ నగర శివారులోని సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ సీబీఆర్ కాలనీలో బిల్డర్ జన్వాడ రవి ఓ భవనాన్ని నిర్మిస్తున్నారు. అయితే, రామచంద్రాపురం సాయి నగర్‌కు చెందిన దగుడు రాము(42).. తనకు హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఆర్డీవో, తహసీల్దార్ తెలుసునని, పాతబస్తీకి చెందిన పహిల్వాన్లతో తనకు పరిచయాలున్నాయని, నిర్మిస్తున్న భవనంపై కథనాలు రాసి కూల్చివేయిస్తానని బిల్డర్‌ను బెదిరించాడు. తనకు రూ.5 లక్షల ఇవ్వాలని లేదంటే తన పత్రికలో భవనం ఫొటో వేసి వార్తలు ప్రచురిస్తానని హెచ్చరించాడు. దీంతో బిల్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి నిందితుడు రామును అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలో కొందరు పత్రికలు, యూట్యూబ్ ఛానళ్ల ప్రతినిధుల పేరుతో డబ్బుల కోసం కొందరు బెదిరిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు.

ఇక్కడ ఉండొద్దు ఖాళీ చెయ్యండి

» సున్నం చెరువు నిర్వాసితులకు హైడ్రా ఆదేశం

» ప్రత్యామ్నాయం చూపాలని బాధితుల వేడుకోలు

రాయదుర్గం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, మాదాపూర్ సున్నం చెరువులో ఆక్రమణలను నాలుగు రోజుల క్రితం కూల్చేసిన హైడ్రా అధికారులు ఆ ప్రాంతాన్ని గురువారం మరోసారి పరిశీలించారు. ఆ స్థలంలో గుడిసెలు వేసుకున్న వారిని వెంటనే ఖాళీ చేసి వెళ్లిపోవాలని, గుడిసెలను కూడా తొలగించాలని ఆదేశించారు. ఆ స్థలంలో నివాసముండకూడదని స్పష్టం చేశారు. అయితే, చిన్నపిల్లలతో ఉన్న తాము ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళ్లాలని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమకు ప్రత్యామ్నాయం చూపాలని వేడుకున్నారు.

సున్నం చెరువు పరిధిపై రీసర్వే చెయ్యండి

ఎస్ఐఈటీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ వినతి

పంజాగుట్ట, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కష్టపడి సంపాదించిన పైసా పైసా కూడబెట్టి భూమిని కొనుగోలు చేసి అన్ని అనుమతులతో తాము నిర్మించుకున్న ఇళ్లను ఎఫ్‌టీఎల్ పేరుతో కూల్చివేయడం అన్యాయమని ఎస్ఐఈటీ(స్మాల్ ఇండస్ట్రీస్ ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్) ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్లాట్ల యజమానులు వాపోయారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆ సొసైటీ అధ్యక్షుడు బీఎస్ఎన్ రాజు, ఇతర సభ్యులు మాట్లాడారు. శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేటలోని సర్వే నెంబర్ 12, 12ఏ,13లోని 24 ఎకరాల ప్రైవేట్ భూమిని 1990లో కొనుగోలు చేయగా, 1992లో హెచ్ఎండీఏ అనుమతులతో సొసైటీ సభ్యులకు కేటాయించామని తెలిపారు. ఆయా స్థలాలకు యూఎల్‌సీ, ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లించామని చెప్పారు. అన్ని అనుమతులు పొందడంతో కొందరు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని, కొందరు తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని వివరించారు. సున్నం చెరువు పరిధిపై రీ సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ణయించాలని, ఒక వేళ భూమి అంతా ప్రభుత్వం తీసుకుంటే తమకు ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేశారు.

మూడ్రోజులుగా నిలిచిన 'మీ-సేవ'!

» సర్వర్‌లో సాంకేతిక సమస్య.. రెండ్రోజులు పట్టే అవకాశం

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మీ-సేవా కేంద్రాల్లో గత మూడ్రోజులుగా పౌర సేవలు నిలిచిపోయాయి. రాష్ట్ర స్థాయిలో వివిధ విభాగాలు, శాఖల సర్వర్లలో మార్పులు చేర్పులు చేస్తున్న నేపథ్యంలో ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ పరిస్థితి ఎదురైంది. మూడ్రోజులుగా సేవలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సేవలు నిలిచాయని, మరో రెండ్రోజుల్లో పునరుద్ధరించే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు.

బిల్లులు రాలేదని బడికి తాళం వేసిన కాంట్రాక్టర్

కామారెడ్డి రూరల్, సెప్టెంబరు 12: పాఠశాలలో చేసిన భవన నిర్మాణ పనులకు బిల్లులు రాలేదని ఓ కాంట్రాక్టర్ బడికి తాళం వేశాడు. ఈ సంఘటన కామారెడ్డి జిల్లాలో జరిగింది. కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కాంట్రాక్టర్ నిఖిల్ భవన నిర్మాణ పనులను ఏడాదిన్నర క్రితం చేపట్టారు. అప్పటి నుంచి బిల్లులు రాకపోవడంతో ఆవేదనకు గురై గురువారం బెంచీలు బయటవేసి, తరగతి గదులకు తాళం వేశాడు. దీంతో విద్యార్థులు బయట ఉన్న చెట్ల కింద కూర్చోవాల్సి వచ్చింది. కాంట్రాక్టర్ తీరుపైన ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పాఠశాల విద్యాకమిటీ సభ్యులు, గ్రామస్థులు కాంట్రాక్టర్‌కు సర్ది చెప్పడంతో తాళాలు తీశాడు.

ఇన్‌స్టా రీల్‌తో చిన్నారులకు పెద్ద సాయం

తల్లిని కోల్పోయిన పిల్లలకు రూ.21 లక్షలు ఇచ్చిన దాతలు

నర్సింహులపేట(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 12 : సోషల్ మీడియాను సక్రమంగా వాడుకుంటే అద్భుతాలు జరుగుతాయి, ఎన్నో సమస్యలు ఇట్టే పరిష్కారమవుతాయి అనేందుకు ఉదాహరణగా నిలిచే ఘటన మహబూబాబాద్ జిల్లాలో జరిగింది. తల్లిని కోల్పోయిన అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారులకు మానవత్వం కలిగిన ఎన్నో హృదయాలు అండగా నిలిచాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను చూసి స్పందించిన దాతలంతా కలిసి ఆ చిన్నారులకు ఏకంగా రూ21 లక్షలు ఆర్థిక సాయం చేసి ఔరా అనిపించారు. వివరాలిలా ఉన్నాయి.. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం బొజ్జన్నపేటకు చెందిన బేతమల్ల నరేష్, ఉమ దంపతులకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. నరేష్ తాపి మేస్త్రీగా పని చేస్తుంటాడు. ఈ దంపతులకు ఓ కుమార్తె(3), ఓ కుమారుడు(నెలన్నర) ఉన్నారు. అయితే, కొడుకును ప్రసవించిన ఎనిమిది రోజులకు, జూలై 28న ఉమ బ్రెయిన్ స్ట్రోక్ గురై మరణించింది. నిరుపేద అయిన తండ్రి, లోకం తెలియని ఆ పిల్లల పరిస్థితిని తెలుసుకున్న మహబూబాబాద్ జిల్లా కురవికి చెందిన సోషల్ మీడియా ఇన్ఫులెయెన్సర్ గంగరబోయిన రఘు చలించిపోయారు. నరేష్ ఇంటికి వెళ్లి వారి పరిస్థితిని వివరించేలా ఓ వీడియో చేసి ఆ పిల్లలకు సాయం చేయాలని కోరుతూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. రఘు పిలుపునకు స్పందించి ముందుకొచ్చిన దాతలు ఆర్థిక సాయం పంపారు. దాతల పంపిన మొత్తం రూ.21 లక్షలు అవ్వగా.. ఆ సొమ్మును చిన్నారుల పేరిట మహబూబాబాద్ ఎస్‌బీఐలో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఇందుకు సంబంధించిన పత్రాలను నరేష్‌కు గురువారం అందజేశారు. ఆ చిన్నారులకు ఇంత సాయం అందడానికి కారణమైన గంగరబోయిన రఘును పలువురు అభినందించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనలకు.. లైసెన్స్ రద్దు!

» ప్రమాదాల పెరుగుదల నేపథ్యంలో కఠిన చర్యలకు రవాణా శాఖ కసరత్తు..


హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై మరింత కఠినంగా వ్యవహరించాలని రవాణా శాఖ నిర్ణయించింది. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలకు రంగం సిద్ధం చేస్తోంది. ఇక నుంచి రాంగ్ రూట్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతి వేగం, రేసింగ్‌లు తదితర ఉల్లంఘనల విషయంలో కూడా సీరియస్‌గా వ్యవహరించనున్నారు. మద్యం సేవించి వాహనం నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలకు మాత్రమే ప్రస్తుతం కోర్టు ఆదేశాలు, పోలీసుల సిఫారసు మేరకు 3 నుంచి 6 నెలల పాటు లైసెన్స్‌లను సస్పెన్షన్‌లో పెడుతున్నారు. మిగతా ఉల్లంఘనలకు సంబంధించి డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం లేదు. ఈ నేపథ్యంలో చిన్న చిన్న ఉల్లంఘనలకు సంబంధించి కూడా ఇకపై లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టనున్నట్లు రవాణా శాఖ వర్గాలు తెలిపాయి. మెజార్టీ రోడ్డు ప్రమాదాలకు వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం కారణమని గుర్తించిన నేపథ్యంలో నిబంధనల కచ్చిత అమలుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. కాగా, గత రెండున్నరేళ్లలో వివిధ ఉల్లంఘనలకు సంబంధించి 26 వేలకుపైగా డ్రైవింగ్ లైసెన్స్‌లను రవాణా శాఖ సస్పెండ్ చేసింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో 2022-23లో అత్యధికంగా 16 వేలకు పైగా లైసెన్స్‌లు సస్పెండ్ చేశారు. 2023-24లో 7 వేలకు పైగా.. ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 2,200 లైసెన్స్‌లు సస్పెన్షన్‌లో పెట్టారు.

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా కార్యాచరణ

» ఢిల్లీలో ఏఐసీసీ చీఫ్ ఖర్గేతో మహేష్‌కుమార్ గౌడ్ భేటీ

» ఉప ఎన్నికలు రాకపోవచ్చన్న టీపీసీసీ కొత్త అధ్యక్షుడు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా తన కార్యాచరణ ఉంటుందని టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తగా నియమితులైన మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన తన కుటుంబసభ్యులతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను రాజాజీమార్గ్‌లోని నివాసంలో కలుసుకున్నారు. అనంతరం మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఖర్గే ఆశీర్వాదం కోసం వచ్చినట్లు తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకుని కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఖర్గే సూచించినట్లు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడు మారిన ప్రతిసారి కొత్త కమిటీలు ఏర్పడతాయని, కొత్త కమిటీల విషయంలో ఏఐసీసీ పెద్దలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కమిటీల ఏర్పాటులో వెనుకబడిన వర్గాలకు పెద్దపీట వేస్తామని చెప్పారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. పార్టీ ఫిరాయించిన అంశంలో హైకోర్టు నిర్ణయాన్ని గౌరవిస్తూనే.. న్యాయప్రత్యామ్నాయాలు చూస్తామని తెలిపారు. తమ పార్టీ విధానాలు, పాలన చూసి కొందరు నేతలు వస్తే చేర్చుకున్నట్లు మహేష్‌కుమార్ గౌడ్ తెలిపారు. ప్రతిపక్ష పాత్ర నిర్వహించే స్థితిలో బీఆర్ఎస్ నేతలు లేరని, లోక్‌సభ ఎన్నికలలో ప్రజలు వారికి సున్నా స్థానాలు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంలో ఉప ఎన్నికలు వస్తాయని తాను భావించడంలేదని, ఒక వేళ వచ్చినా ఆ స్థానాలు తమ ఖాతాలోనే పడతాయని మహేష్‌కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తం చేశారు. అరికెపూడి గాంధీ సాంకేతికంగా బీఆర్ఎస్ సభ్యుడని, నిబంధనల మేరకే పీఏసీ చైర్మన్ అయ్యారని అన్నారు. మరోవైపు ఎయిమ్స్ ఆస్పత్రిలో సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతిక కాయానికి మహేష్‌కుమార్ గౌడ్ నివాళులు అర్పించారు.



ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మహేష్‌కుమార్ గౌడ్, కుటుంబ సభ్యులు

విద్యుత్తు కొనుగోళ్లపై నిషేధం!

పవర్‌గ్రిడ్‌కు రూ.261 కోట్లు చెల్లించలేదని టీజీఎస్పీడీసీఎల్‌పై గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా చర్యలు

» ఛత్తీస్‌గఢ్ విద్యుత్తు కొనుగోలులో గత ప్రభుత్వ నిర్వాకంతోనే..

» హైకోర్టును ఆశ్రయించిన ఎస్పీడీసీఎల్

» పవర్‌గ్రిడ్ ఉత్తర్వులపై స్టే విధించిన కోర్టు



హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్తు సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)కు గత ప్రభుత్వ నిర్వాకంతో షాక్ తగిలింది. ముందుచూపు లేకుండా తీసుకున్న నిర్ణయం డిస్కమ్‌కు శాపంలా మారింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్తును తీసుకుంటామని కారిడార్ బుక్ చేసుకున్న తర్వాత, అవసరం లేదని పేర్కొన్న కేసులో రూ.261.31 కోట్లను ఎస్పీడీసీఎల్ చెల్లించడం లేదంటూ పవర్ గ్రిడ్ జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)కు ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎన్ఎల్‌డీసీ బహిరంగ విపణిలో ఎస్పీడీసీఎల్ విద్యుత్తు క్రయవిక్రయాలపై గురువారం ఉదయం నిషేధం విధించింది. గత ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లోని మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్లు, అదనంగా మరో 1000 మెగావాట్ల కోసం పవర్‌గ్రిడ్‌తో ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. విద్యుత్తు చెల్లింపుల వివాదంతో మార్వా ప్లాంట్ నుంచి 1000 మెగావాట్ల కరెంట్ ఆగిపోగా.. అదనంగా తీసుకుంటామని చెప్పిన 1000మెగావాట్లపై బీఆర్ఎస్ సర్కారు వెనక్కి తగ్గింది. అయితే, తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తితో లైన్లు వేసినప్పటికీ వినియోగించుకోకుండా వదిలేసినందున చార్జీల కింద రూ.261.31కోట్లు చెల్లించాలంటూ మార్చి 12న పవర్ గ్రిడ్ తెలంగాణ పవర్ కో-ఆర్డినేషన్ కమిటీకి బిల్లును పంపింది. దీనిపై కేంద్ర విద్యుత్తు నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ)లో టీజీఎస్పీడీసీఎల్ పిటిషన్ వేసింది. ఈ కేసులో వాదనలు జరగాల్సి ఉండగా.. 'గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా'కు పవర్ గ్రిడ్ ఫిర్యాదు చేసింది. దీంతో బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోళ్లకు అవకాశం లేకుండా కట్టడి చేస్తూ బుధవారం ప్రాప్తి (పేమెంట్ రాటిఫికేషన్ ఇన్ పవర్ ప్రొక్యూర్‌మెంట్ ఫర్ బ్రింగింగ్ ట్రాన్స్‌పరెన్సీ ఇన్ ఇన్‌వాయిసింగ్ ఆఫ్ జనరేటర్స్) పోర్టల్ నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ఆధారంగా గురువారం ఉదయం నుంచి కరెంట్ కొనుగోళ్ల నిలుపుదల చేసింది. విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వెంటనే హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేయాలని ఆదేశించారు. సీఎం సూచనలతో అధికారులు కోర్టును ఆశ్రయించారు.

స్టే విధించిన హైకోర్టు

చార్జీల కేసు సీఈఆర్‌సీలో పెండింగ్‌లో ఉండగా కఠిన చర్యలు చేపట్టడం అక్రమమని, రాష్ట్ర ప్రజలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని పేర్కొంటూ టీజీఎస్పీడీసీఎల్ హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. డిస్కం తరఫున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. కమిషన్ వద్ద కేసు పెండింగ్‌లో ఉండగానే ప్రతివాదులు లేట్ పేమెంట్ సర్‌చార్జి నిబంధనల కింద పిటిషనర్‌ను డీఫాల్టర్ జాబితాలో పెట్టడం అక్రమమని తెలిపారు. పిటిషనర్ విద్యుత్తు కొనుగోళ్లలో పాల్గొనేలా అనుమతించాలని కోరారు. పవర్‌గ్రిడ్, కేంద్రం తరఫున అసిస్టెంట్ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు నోటీసు ఇచ్చి ఆరు నెలలైనా స్పందించకపోవడం వల్లే చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ఇదే తరహా వివాదంలో 25శాతం చార్జీలు చెల్లిస్తే విద్యుత్తు కొనుగోళ్లకు అనుమతించాలని ఢిల్లీ హైకోర్టు ఇటీవల తీర్పు ఇచ్చిందని తెలిపారు. పిటిషనర్ కూడా రూ.261 కోట్లలో 25 శాతం చెల్లిస్తే పవర్ ట్రేడింగ్‌కు అనుమతిస్తామని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం 'ఇది రాష్ట్రంలోని కోట్లాది మందికి విద్యుత్తు సరఫరాకు సంబంధించిన అంశం. సరఫరా నిలిచిపోతే ఇబ్బందులొస్తాయి. ఇతర వనరులు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో తెలంగాణ సొంతంగా విద్యుదుత్పత్తి చేసుకోగలుగుతోంది. రాష్ట్రానికి కారిడార్ అవసరం లేకపోయి ఉండొచ్చు'అని పేర్కొంది. చార్జీల వివాదం సెంట్రల్‌కమిషన్ వద్ద పెండింగ్‌లో ఉండగా విద్యుత్తు కొనుగోళ్లు చేయకుండా పిటిషనర్‌ను అడ్డుకోవడం సరికాదని పేర్కొంది. ప్రాప్తి పోర్టల్ ద్వారా జారీచేసిన ఉత్తర్వులపై స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. పిటిషనర్‌ను విద్యుత్తు క్రయవిక్రయాల్లో పాల్గొనేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. తదుపరి ఉత్తర్వులిచ్చే వరకు ఆదేశాలు కొనసాగుతాయని పేర్కొంటూ విచారణను అక్టోబరు 17కు వాయిదా వేసింది. ఈ విషయాన్ని వెంటనే ప్రతివాదులకు తెలియజేయాలని ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించింది. ఈ అంశంపై వివరణ ఇవ్వాలంటూ గ్రిడ్ కంట్రోలర్ ఆఫ్ ఇండియా, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్, సెంట్రల్ ట్రాన్స్‌మిషన్ యుటిలిటీ ఆఫ్ ఇండియా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్, కేంద్ర విద్యుత్తు శాఖకు నోటీసులు జారీచేసింది.

బతకడానికి వచ్చినోళ్ల ఓట్లతోనే బీఆర్ఎస్‌కు సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. గురువారం ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో తెలుగు మీడియాతో రేవంత్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. బీఆర్ఎస్‌లో చిల్లరగాళ్లు, బ్రోకర్లు చేరినందుకే కేసీఆర్ దగ్గరికి వెళ్లేందుకు తనకు మనసు రావడం లేదని అరికెపూడి గాంధీ అంటున్నారని తెలిపారు. "ధర్నాలు చేయొద్దు. ఎక్కడి నుంచి వచ్చారు?" అని గతంలో కేసీఆర్ ఆంధ్రవారిని ఉద్దేశించి అన్న మాటలనే ఇప్పుడు కౌశిక్ రెడ్డి అంటున్నారని ధ్వజమెత్తారు. గాంధీకి పీఏసీ పదవి ఇవ్వడంలో తప్పేమీ లేదని.. గతంలో కూడా ఇతరులను పీఏసీలో నియమించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. బీఆర్ఎస్‌కు తాము ఓనర్లమయినందున ఆ స్థానంలో తామే ఉండాలని హరీశ్ భావిస్తున్నారని ఆరోపించారు. 2018-23 మధ్య కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటే.. అక్బరుద్దీన్ ఒవైసీని పీఏసీ చైర్మన్‌గా ఎలా నియమించారని రేవంత్ ప్రశ్నించారు. 2014లో టీడీపీలో 15 మంది ఎమ్మెల్యేలున్నా బీఏసీకి ఎర్రబెల్లిని రానిచ్చారని, తనను అనుమతించలేదని.. ఎర్రబెల్లి పార్టీ మారినప్పుడు టీడీపీ ఫ్లోర్ లీడర్‌గా తనను నియమించాలంటూ చంద్రబాబు లేఖ ఇచ్చినా నాటి సభాపతి పట్టించుకోలేదని గుర్తుచేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలపై స్పీకర్ నాలుగు వారాలలో నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును తాను అధ్యయనం చేయలేదని చెప్పారు. ప్రభుత్వాన్ని పడగొడతామని బెదిరింపులు చేసినందుకే ఇటువంటి సమస్యలు వస్తున్నాయని.. అలా పడగొట్టే అవకాశం లేకపోతే తమకొచ్చే ప్రమాదం ఏమీ ఉండదని అన్నారు. ఏ పార్టీ వాళ్లు ఆ పార్టీలోనే ఉండాలని అంటే తనకొచ్చిన ఇబ్బందేమీ లేదని, కేసీఆర్ లక్కీ నెంబర్ అయిన 66మంది ఎమ్మెల్యేల బలం కాంగ్రెస్‌కు ఉందని చమత్కరించారు. బీఏసీలో అన్ని పార్టీలకూ తాము అవకాశం ఇచ్చామని, కాంగ్రెస్‌కు తరఫున నలుగురు ఉంటే బీఆర్ఎస్ నుంచి ఆరుగురిని, సీపీఐ, బీజేపీ, ఎంఐఎం నుంచి ఒక్కొక్కరిని చేర్చుకున్నామని చెప్పారు. కౌన్సిల్‌లో తమకు మెజారిటీ లేనందువల్ల బీఆర్ఎస్ నుంచి ముగ్గురిని తీసుకున్నామని, ఆ పార్టీకి తామేమీ లోటు చేయలేదన్నారు.



ఏపీ సీఎం చంద్రబాబుకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు

చంద్రబాబును అభినందించిన ఉత్తమ్

వెలగపూడి సచివాలయంలో బాబుతో భేటీ

అమరావతి, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నాలుగోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీఎం చంద్రబాబు నాయుడును తెలంగాణ జల వనరుల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అభినందించారు. తన మిత్రుడి ఇంట జరిగిన ఓ కార్యక్రమానికి హాజరయ్యేందుకు గురువారం విజయవాడకు వచ్చిన ఉత్తమ్‌కుమార్ రెడ్డి దంపతులు వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. బాబుకు అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రిగా నాలుగోసారి బాధ్యతలు స్వీకరించడం పట్ల సంతోషంగా ఉందని ముఖ్యమంత్రితో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాగా.. ఇరువురి మధ్య స్నేహపూర్వక పరస్పర అభినందనలు మినహా.. రాష్ట్రాల అంశాలు ప్రస్తావనకు రాలేదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

మంత్రివర్గ విస్తరణపై వచ్చే వారమే చర్చలు?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ అధిష్ఠానంతో సీఎం రేవంత్‌రెడ్డి చర్చలు వచ్చే వారమే జరిగే అవకాశాలున్నాయి. రేవంత్ వచ్చే సోమవారం (16న) మరోసారి ఢిల్లీకి రానున్న సంగతి తెలిసిందే. అయితే.. పార్టీ సంస్థాగత ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గురువారం ఆయన నివాసంలో భేటీ అయిన రేవంత్ రెడ్డి దీనిపై ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అంతకుముందు మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడిన సమయంలో మంత్రివర్గ విస్తరణపై సీఎంను ప్రశ్నించగా.. పీసీసీ అధ్యక్షుడే దానికి సమాధానం చెబుతారని ఆయన పేర్కొన్నారు. మంత్రివర్గాన్ని విస్తరించాలని పార్టీ అధ్యక్షుడిగా ఆయన నిర్ణయిస్తే.. ఎవరెవరిని తీసుకోవాలో తాను నిర్ణయిస్తానని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్ అనంతరం రేవంత్ హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

'స్థానికత'పై సుప్రీం కోర్టుకు సర్కారు

» త్వరగా విచారించాలన్న విజ్ఞప్తికి ధర్మాసనం ఓకే

» హైకోర్టు తీర్పుతో రాష్ట్రంలో ఆగిన వైద్య విద్య ప్రవేశాలు

» సర్కారుకు అనుకూలంగా తీర్పు వస్తే వేగంగా అడ్మిషన్లు

» లేదంటే మళ్లీ మార్గదర్శకాలు ఇవ్వాల్సిందే



న్యూఢిల్లీ/హైదరాబాద్, సెప్టెంబరు 12(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశాల్లో స్థానికత వ్యవహారంపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. వైద్య విద్యలో అడ్మిషన్లు పొందడానికి తొమ్మిది, పది తరగతులతోపాటు ఇంటర్మీడియట్ విద్యను తెలంగాణలో పూర్తి చేసిన వారికే స్థానిక రిజర్వేషన్ వర్తింపజేస్తామంటూ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 33పై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. కోర్టు సైతం అభ్యంతరం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో వరుసగా నాలుగేళ్లు చదువుకోలేదన్న కారణంతో శాశ్వత నివాసులకు ఎంబీబీఎస్, బీడీఎస్ అడ్మిషన్ నిరాకరించకూడదని సదరు ఆదేశాల్లో పేర్కొంది. దీన్ని సవాల్ చేస్తూ తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గురువారం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను వెంటనే విచారణకు స్వీకరించాలని ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనాన్ని తెలంగాణ తరఫు న్యాయవాదులు కోరగా.. ధర్మాసనం అంగీకరించింది. అయితే, వైద్య విద్య ప్రవేశాలపై సందిగ్ధం నెలకొన్న వేళ.. సుప్రీం కోర్టు ఏం తీర్పు వెలువరిస్తుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఒక వేళ హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టు స్టే ఇస్తే... వెంటనే ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఒక వేళ హైకోర్టు తీర్పును సమర్థిస్తే మాత్రం కౌన్సెలింగ్ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వైద్య శాఖ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. గతంలో సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అక్టోబరు 1 నుంచే వైద్య విద్య తరగతులు ప్రారంభం కావాలి. అక్టోబరు 30లోగా వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాలి. ఆ తర్వాత ఎలాంటి ప్రవేశాలు చేపట్టకూడదు. అందుకు మరో 47 రోజులే గడువు ఉండగా.. రాష్ట్రంలో ఇప్పటిదాకా ప్రవేశాల ప్రక్రియే ప్రారంభం కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇదే విషయమై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులతో వైద్య విద్య ప్రవేశాలపై సమీక్ష నిర్వహించారు. కౌన్సెలింగ్ పూర్తి కావడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందంటూ ఆరా తీశారు. ఒక వేళ సుప్రీంకోర్టులో అనుకూల తీర్పు రాకుంటే తక్షణమే స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుందని, ఆ ప్రకారం రెసిడెన్స్ సర్టిఫికెట్ల జారీకి సమయం పడుతుందని అధికారులు మంత్రికి వివరించారు.

4 రౌండ్లు... ఒక్కో దానికి 10 రోజులు

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌ను నాలుగు విడతల్లో నిర్వహిస్తారు. కన్వీనర్, యాజమాన్య, ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీ తర్వాత, విద్యార్థులు చేరకుండా మిగిలిపోయిన సీట్లకు చివరిగా స్ట్రే వేకెన్సీ రౌండ్ ద్వారా భర్తీ చేస్తారు. ఒక్కో రౌండ్‌కు కనీసం పది రోజుల సమయం పడుతుంది. ఈ ఏడాది ఎంబీబీఎస్‌లో కన్వీనర్ కోటా సీట్ల కోసం 17,654 మంది, యాజమాన్య, ఎన్ఆర్ఐ కేటగిరీల కింద మరో 6,468 మంది దరఖాస్తు చేసుకున్నారు. వెరసి మొత్తం 24,122 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అడ్మిషన్ల ప్రక్రియ అంతా అక్టోబరు 30లోగానే పూర్తి చేయాలి. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆలోగా ప్రక్రియ పూర్తి చేయకుంటే మిగిలిపోయిన సీట్లను అలా వదిలేయాల్సిందే. ఈ నేపథ్యంలో అటు వైద్యశాఖలోనూ, ఇటు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లోనూ తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వాస్తవానికి గత నెల 3వ తేదీ నుంచే దేశ వ్యాప్తంగా ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. ఆలిండియా కోటా సీట్లకు ఆగస్టు రెండో వారంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇప్పటికే దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయింది. సుప్రీం కోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పువచ్చినా...సమయం సరిపోకపోవచ్చన్న అభిప్రాయాలున్నాయి.ఈ నేపథ్యంలో ఒక వేళ రాష్ట్రంలో సీటు రాని విద్యార్థులు.. పొరుగు రాష్ట్రాల్లోని కాలేజీల్లో చేరే అవకాశం కోల్పోనున్నారు.

కేంద్ర సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి

లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలి.. పన్నుల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి

» బీజేపీయేతర రాష్ట్రాల మంత్రుల భేటీలో డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వసూలు చేస్తున్న సెస్‌లు, సర్‌చార్జీల వల్ల రాష్ట్రాల పన్నుల వాటా నిధుల్లో కోత పడుతోందని రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి సెస్‌లు, సర్‌చార్జీలను నిరోధించాలని లేదంటే వాటిలోనూ రాష్ట్రాలకు వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఐదు బీజేపీయేతర రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్ ఆర్థిక మంత్రుల సమావేశం గురువారం కేరళలోని తిరువనంతపురంలో జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న భట్టివిక్రమార్క.. పన్నుల వాటా విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని తప్పుపట్టారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు ఇచ్చే నిధులను 14వ ఆర్థిక సంఘం 32 నుంచి 42 శాతానికి పెంచిందని, 15వ ఆర్థిక సంఘం దాన్ని 41 శాతానికి కుదించిందని తెలిపారు. ఈ 41 శాతం నిధులు కూడా రాష్ట్రాలకు రావడం లేదని, కేవలం 31 శాతం నిధులు మాత్రమే అందుతున్నాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సెస్‌లు, సర్‌చార్జీలను వసూలు చేస్తుండడంతో పన్నుల వాటా తగ్గుతుందని అన్నారు. వీటిని కూడా రాష్ట్రాలకు పంచాలని అడుగుతుంటే కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. దక్షిణాది రాష్ట్రాలు కేంద్ర జీడీపీకి 30 శాతం భాగస్వామ్యాన్ని అందిస్తున్నాయని, దేశ జనాభాలో 19.6 శాతం జనాభా ఈ రాష్ట్రాల్లోనే ఉందని తెలిపారు. కానీ, ఈ రాష్ట్రాలకు పన్నుల్లో వాటా నిధులు 21.07 శాతం నుంచి 15.80 శాతానికి తగ్గిపోయాయని చెప్పారు. వస్తు సేవల పన్ను (జీఎస్టీ) కింద రాష్ట్రాలకు ఇవ్వాల్సిన పరిహారాన్ని సకాలంలో ఇవ్వడం లేదని, పర్యవసానంగా రాష్ట్రాలు ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోవడంలో ఇబ్బంది పడాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల(సీఎస్ఎస్)లో కఠినమైన నిబంధనలున్నాయని, వాటికి రాష్ట్రాలు మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేయాల్సి వస్తుండడంతో ఆర్థిక భారం పడుతుందని చెప్పారు. ఇలా సీఎస్ఎస్‌ల కోసం రాష్ట్ర సొంత వనరులను మళ్లించాల్సి వస్తుండడంతో ఇతర ముఖ్యమైన రాష్ట్ర పథకాలకు నిధుల కొరత ఏర్పడుతుందన్నారు. రాష్ట్రాలకు నికరంగా వచ్చే పన్నుల వాటా నిధులను తగ్గిస్తూ.. మరోవైపు రాష్ట్రాలకు సరిగా ఉపయోగపడని సీఎస్ఎస్‌లకు కేంద్ర ప్రభుత్వం నిధులను పెంచుతోందని ఆరోపించారు. ఇప్పటికే దేశ ద్రవ్య లోటు జీడీపీలో 5.6 శాతానికి పెరిగిందన్నారు. ద్రవ్య బాధ్యతను పాటిస్తున్న రాష్ట్రాలకు ఒక నీతి, ద్రవ్యలోటు పెరుగుతున్నా యథేచ్ఛగా రుణాలు తీసుకునే కేంద్రానికి మరో నీతా అని ప్రశ్నించారు.



ఇవీ రాష్ట్ర డిమాండ్లు..

- కేంద్ర ప్రభుత్వ సెస్సులు, సర్‌చార్జీలను నిరోధించాలి.
- కేంద్ర పన్నుల్లో వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి.
- ద్రవ్య బాధ్యత పాటించే రాష్ట్రాలు ఎక్కువ రుణాలు తీసుకునేలా స్వయంప్రతిపత్తిని కల్పించాలి.
- డీలిమిటేషన్ ప్రక్రియలో దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభ సీట్లు పెరిగేలా చూడాలి.
- కేంద్రప్రాయోజిత పథకాలను రాష్ట్రాలు తమ అవసరాలకు తగ్గట్టు వినియోగించుకునే అవకాశమివ్వాలి.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.3। కనిష్ఠం 25.2

ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5
శుక్రవారం 13 సెప్టెంబరు 2024

పథకాలను వినియోగించుకోవాలి : పరిశ్రమల శాఖ జీఎం

ఆదిలాబాద్‌అర్బన్, సెప్టెంబరు12: పీఎం విశ్వకర్మ పథకంపై ఆయా కులవృత్తుల వారికి అవగాహన కల్పించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో దరఖాస్తు, యూనిట్ల స్థాపన, రుణాలు తదితర వాటిపై పవర్ పాయింట్ ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. కులవృత్తుల వారు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని పరిశ్రమల శాఖ జీఎం పద్మభూషణ్‌రాజు సూచించారు. కులవృత్తుల వారికి పలు విషయాలపై అవగాహన కల్పించడం జరిగిందని, రుణాలు పొందాలన్నారు.





• జైనథ్ మండలంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీతో పోలీసులు

గుట్టుగా దందా

దొరికితేనే దొంగ

- జిల్లాలో హద్దు మీరుతున్న రేషన్ అక్రమ దందా
- వరుసగా పట్టుబడుతున్న రేషన్ బియ్యం
- కేసులు నమోదు చేస్తూ వదిలేస్తున్న అధికారులు
- తప్పించుకుంటున్న అసలు సూత్రధారులు
- కానరాని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు
- సన్నబియ్యం మోజులో పడి దొడ్డుబియ్యాన్ని చౌకగానే అమ్మేస్తున్న లబ్ధిదారులు



జైనథ్ మండలంలో నిర్వహించిన పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్)

ఆదిలాబాద్, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ దందా జోరుగా సాగుతోంది. దొరికితే దొంగ లేదంటే దొర అన్న చందంగా అక్రమ రవాణా జరుగుతోంది. ఏదైనా సమాచారం, ఫిర్యాదు చేస్తేనే అధికారులు హడావుడి చేస్తున్నారు. కానీ ముందు చూపుతో అక్రమ దందాకు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నాలు చేయడం లేదు. దీంతో రేషన్ బియ్యం మాఫియా ఆగడాలకు అడ్డు అదుపే లేకుండా పోతోంది. ఈ యేడు జనవరి నుంచి సెప్టెంబరు12 వరకు జిల్లాలో 26 కేసులు నమోదు కాగా సుమారుగా 1600 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా గురువారం ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డికి అందిన ముందస్తు సమాచారంతో జైనథ్ మండలం బోరజ్ చెక్‌పోస్టు వద్ద అక్రమంగా మహారాష్ట్రకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని వెంబడించి పోలీసులు పట్టుకున్నారు. ఇందులో తరలిస్తున్న 280క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నెల రోజుల క్రితమే ఇంద్రవెల్లి, బేల, జైనథ్ ఆదిలాబాద్, మావల మండలాల్లో పోలీసుల తనిఖీల్లో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాలు పట్టుబడ్డాయి. ఇలా జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ దందా నిత్యం యథేచ్ఛగా సాగుతోంది. పట్టుకున్న కొద్ది వందలాది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడుతున్న అడ్డుకట్ట మాత్రం పడడం లేదు. ఎందుకంటే లబ్ధిదారులకు అవగాహన లేక పోవడంతో రేషన్ బియ్యాన్ని దళారులకు అమ్మేసుకుంటున్నారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులు అవగాహన కల్పించక పోవడం లోతుగా దృష్టి సారించక పోవడంతో ప్రభుత్వ లక్ష్యం పూర్తిగా నీరుగారిపోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ..

జిల్లాలో రేషన్ బియ్యం పంపిణీ, సరఫరా, వినియోగంపై అధికారుల పర్యవేక్షణ కొరవడినట్లు కనిపిస్తోంది. నిరంతరంగా తనిఖీలు నిర్వహిస్తూ అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పత్తా లేకుండానే పోయారన్న ఫిర్యాదులు వస్తున్నాయి. పోలీసుల తనిఖీల్లో భారీగా అక్రమ బియ్యం పట్టుబడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అప్రమత్తమైనట్లు కనిపించడం లేదు. జిల్లాలో నలుగురు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మాత్రమే ఉన్నారు. దీంతో నామమాత్రంగానే తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. మహారాష్ట్రను ఆనుకుని జిల్లా సరిహద్దులపై నిరంతరంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. జిల్లా మీదుగానే నిత్యం మహారాష్ట్రతో పాటు ఇతర రాష్ట్రాలకు రేషన్ బియ్యాన్ని తరలిస్తూ దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా జైనథ్ మండలం బోరజ్ చెక్‌పోస్టు వద్ద నిర్మల్ జిల్లా అన్నపూర్ణ రైస్‌మిల్ ట్రేడర్స్ నుంచి మహారాష్ట్రలోని గొండియా జిల్లాకు రాయితీ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

అమాయకుల పైనే కేసులు..

రాయితీ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టుబడుతున్న వారంతా అమాయకులేనని తెలుస్తోంది. ఈ కేసుల్లో లోతుగా దర్యాప్తు జరగడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో అసలు సూత్రధారులు తప్పించుకుంటున్నారు. అమాయకుల మీదనే నామమాత్రంగా కేసులు నమోదు చేస్తూ వదిలేస్తున్నారన్న టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా లారీ, ఆటో, టాటా మ్యాజిక్ డ్రైవర్లు, కూలీల పైనే ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి. తెరవెనకుండి తతంగం నడిపిస్తున్న అసలు సూత్రధారులు మాత్రం యథేచ్ఛగా బయట తిరుగుతున్నారు. పట్టుబడిన వారిని రోజుల వ్యవధిలోనే బయటకు తీసుకొస్తూ మళ్లీ అదే దందాలో దింపుతున్నారు. దీంతో అక్రమ దందాకు అడ్డుకట్ట పడడం లేదు. అలాగే కొంత మంది అధికారులకు నెలనెలా ముడుపులు ముట్టడంతో కఠినంగా వ్యవహరించడం లేదని తెలుస్తోంది. ఈ కేసుల్లో మరింత లోతుగా దర్యాప్తు జరిపితే అసలు విషయం బయటపడే అవకాశం ఉంది. గంజాయి, మట్కా, గుట్కాపై కఠినంగా వ్యవహరించిన మాదిరిగానే అక్రమ రేషన్ బియ్యం దందాపై పోలీసులు మరింత కఠినంగా వ్యవహరించాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అవగాహన లేకనే..

ప్రభుత్వం సరఫరా చేస్తున్న రాయితీ బియ్యంపై ప్రజల్లో సరైన అవగాహనలేక పోవడంతోనే రాయితీ బియ్యం పక్కదారి పడుతున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత రెండు మూడు ఏళ్లుగా పోషక విలువలతో కూడిన పోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేస్తోంది. ఇందులో తొమ్మిది రకాల పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా చిన్న పిల్లలు, బాలింతలు, మహిళలకు పోర్టిఫైడ్ బియ్యం ఎంతో మేలుచేస్తాయి. కానీ లబ్ధిదారులు సన్నబియ్యం మోజులో పడి దొడ్డుబియ్యాన్ని చౌకగానే అమ్మేసుకుంటున్నారు. కొందరైతే నెలనెలా రేషన్ బియ్యాన్ని అమ్మేస్తూ ఇంటికి అవసరమైన కిరాణా సరుకులను కొనుగోలు చేస్తున్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న అక్రమాలపై నిఘా సారిస్తే కొంతవరకైనా రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్టపడే అవకాశం ఉంటుంది. గ్రామస్థాయిలో లబ్ధిదారులకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. కానీ ఈ దిశగా పౌరసరఫరాల శాఖ అధికారులు ఎక్కడ చర్యలు చేపట్టినట్లు కనిపించడం లేదు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం..

:మహమ్మద్ వాజీద్‌అలీ,
జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఆదిలాబాద్

జిల్లాలో పట్టుబడుతున్న రాయితీ బియ్యం సరఫరాను పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఇది వరకు జిల్లాలో ముగ్గురు డీటీలు మాత్రమే ఉండేవారు. ఇటీవలే మరో ఇద్దరు డీటీలు విధుల్లో చేరారు. ఇకపై జిల్లా సరిహద్దులపై ప్రత్యేక దృష్టిని సారిస్తాం. రాయితీ బియ్యంపై లబ్ధిదారుల్లో మరింత అవగాహన కల్పిస్తాం.



సంక్షిప్త సమాచారం

రిమ్స్‌సూపర్ స్పెషాలిటీలో అరుదైన ఆపరేషన్



సమావేశంలో మాట్లాడుతున్న రిమ్స్ డైరెక్టర్

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబర్ 12 : ఆదిలాబాద్ రిమ్స్ సూపర్ స్పెషాలిటీలో అంకాలజీ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేశారని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. గురువారం రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన అహాషేక్ అనే బాలుడిని పక్క టెముకల్లో (బోన్ క్యాన్సర్) ట్యూమర్ రావడంతో అతి కష్టంపైన అంకాలజిస్ట్ వైద్యులు జక్కుల శ్రీకాంత్ తన బృందం సహాయతో దాదాపు 8 గంటల పాటు శ్రమించి కంతిని తొలగించారన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో చేస్తే రూ.6 లక్షలకు పైగా ఖర్చు అయ్యే వైద్యచికిత్సను ఉచితంగా చేశారని వారిని అభినందించారు. కార్యక్రమంలో రిమ్స్ సూపరిండెంట్ డాక్టర్ అశోక్, యూ రాలజీ డాక్టర్ కార్తీక్, అంకాలజీ డాక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

డీజే సౌండ్స్ వద్దు : డీఎస్పీ

ఉట్నూర్, సెప్టెంబరు 12 : గణేష్ నిమజ్జనం కార్యక్రమాల్లో డీజేసౌండ్స్ లేకుండా శాంతియుతంగా గణేష్ నిమజ్జనం నిర్వహించుకోవాలని ఉట్నూర్ డివిజన్ పోలీసు సూపరింటెండెంట్ నాగేందర్ అన్నారు. ఉట్నూర్ పోలీసుస్టేషన్ ఆవరణలో గురువారం ఉట్నూర్ హిందూఉత్సవ కమిటీ, గణేష్ మండప నిర్వాహకులు, కోశాధికారులతో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు.

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతాం

• ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి

జైనథ్,సెప్టెంబరు 12: ఆదిలాబాద్ డివిజన్ పరిధిలోని ఆయా గ్రామాలలో గల ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉక్కుపాదం మోపుతామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం జైనథ్ మండలంలోని బోరజ్ చెక్‌పోస్టు సమీపంలో 280 క్వింటాళ్ల పీడీఎఫ్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. ఈ పీడీఎఫ్ బియ్యం నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోని గొండియా జిల్లాకు తరలిస్తున్నారని తెలిపారు. ఐచర్ వాహనం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ పీడీఎఫ్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారికి అప్పగించారు. కార్యక్రమంలో జైనథ్ రూరల్ సీఐ సాయనాథ్, జైనథ్ ఎస్సై వి.పురుషోత్తం పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఆదర్శపంచాయతీగా తీర్చిదిద్దాలి

• జిల్లా కలెక్టర్ రాజర్షిషా



స్టీల్ బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 12 : ఏమైయికుంటను ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం మండలంలోని ఏమైయికుంట గ్రామంలో ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మార్మాట్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పర్యటించారు. జాతీయ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ - 2024 అవార్డుకు ఏమైయికుంట గ్రామ పంచాయతీ ఎంపికైనందున అధికారులతో ఆయన సమీక్షించారు. ముందుగా పంచాయతీలో రాష్ట్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన సంస్థ, శ్రీ ఇంద్రాయి మహిళా మండల సమాఖ్య వారి సౌజన్యంతో మినీటెంట్ హౌస్‌కి సంబంధించిన సరస్వతి స్టీల్ బ్యాం కును ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ సాయన్న, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్క ర్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, పంచాయితీ ఈవో విజ యకుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు జైస్వాల్, సంతోష్‌లాల్, మహేందర్ జాదవ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు. 33)సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుతో ఉపాధి

ఆదిలాబాద్‌అర్బన్ :ప్రధానమంత్రి కౌశల్‌వికాస్ యోజన పథకంపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం కలెక్టర్ రాజర్షిషా, ఎన్‌ఎస్‌డీసీ ప్రశాంత్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ ఎస్‌డీసీ ప్రశాంత్ పీఎంకేవీవై గురించి క్లుప్తంగా ప్రిన్సిపల్స్‌కు వివరించారు. ఈ పథకం చెల్లుబాటు అయ్యేలా ధృవీకరణ స్కిల్ ఇండియా కార్డును అందిస్తుందని, దీని ఆధారంగా అభ్యర్థులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకుని, జీవనోపాధిని పొందవచ్చునని వివరించారు. ఆయా కళాశాల, పాఠశాల ప్రిన్సిపల్స్‌తో కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో ఈ స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సును మొదటి సారిగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. డీఓ ప్రణీత, ఆయా కళాశాల పాఠశాలల ప్రిన్సిపల్స్, టీచర్స్ తదితరులున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి

• డీఎమ్అండ్ హెచ్‌వో
• ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ

బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 12: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం డీఎమ్ అండ్ హెచ్‌వో కృష్ణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని రోగులతో ఆయన మాట్లాడారు. అనంతరం పలురికార్డులు, వార్డులను పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలని, మండలవాసులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వైద్యసేవలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి భీం రావు, సిబ్బంది పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న డీఎమ్అండ్‌హెచ్‌వో కృష్ణ

ఆదివాసీల ఆందోళన



ఉట్నూర్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీ మహిళలు

ఉట్నూర్, సెప్టెంబరు 12: ఉమ్మడి జిల్లాలోని జైనూర్ సంఘటనకు బాధ్యులైన నిందితుడిని ఉరి తీయాలంటూ ఆదివాసీ మహిళలు గురువారం ఉట్నూర్ మండల కేం ద్రంలో ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని గిరిజ న భవన్ నుంచి ఆదివాసీ మహిళలు నోటికి నల్లగుడ్డలు కట్టుకొని నిరసన తెలుపుతూ పోలీసుస్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌కు మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా ఆదివాసీ మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి పెందూరు పుష్పారాణి మాట్లాడుతూ జైనూర్ సంఘటనకు బాధ్యుడైన వ్యక్తిని ఉరి తీయాలంటూ డిమాండ్ చేశారు.

నార్నూర్ : జైనూర్ సంఘటన నిందితులను కఠినంగా శిక్షించాలని తుడందెబ్బ ఆధ్వర్యంలో మహిళలు భారీ ర్యాలీ నార్నూర్ మండల కేంద్రం కుంరంభీం భవనం నుంచి పోలీసుస్టేషన్ వరకు నిర్వహించారు. అనంతరం సీఐ రహీంపాషాకి వినతిపత్రాన్ని అందజేశారు. కార్య క్రమం ఆత్రం నాగుబాయి, సుభద్రతబాయి, రీతిగౌతు బాయి, పూసం యమునాబాయి, పతబాయి పాల్గొన్నారు.

గుడిహత్నూర్ : జైనూర్ ఘటనలో నిందితుడిని వెంటనే బహిరంగంగా ఉరి తీయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని గోండ్వాన రాయి సెంటర్ తుడుం దెబ్బ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై సయ్యద్ ఇమ్రాన్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్ర మంలో తుడుం దెబ్బ డివిజన్ అధ్యక్షుడు మెస్రం నాగ్ నాథ్, ఉమ్రి సార్మేడి కాత్లే భరత్, ఆదివాసీ సేన మండల అధ్యక్షులు సేడ్మకి భీంరావు, తుడుం దెబ్బ మండల కార్య దర్శి పెందోర్ జగన్ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : జైనూర్‌లో ఘటనలో నిందితుడిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి ఉరిశిక్ష పడే వరకు పోరాడుతామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు పూర్కు బాపూరావు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని గోండుగూడ నుంచి మౌనంగా భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు ఆత్రం భీంబాయి, గేడం సుమన్‌బాయి, కోవా కోసుబాయి పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్ : నిందితుడిని కఠినంగా శిక్షించాలని, రక్షణ కల్పించాలని తుడుం దెబ్బ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు. బస్టాండ్‌నుంచి కొమురంభీం చౌక్ మీదుగా డీఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

బోథ్ : జైనూర్ నిందితుడిని ఉరితీయాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలో ఆదివాసీలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ నాయ కులు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించాలని డిమాండ్ చేశారు.

ఇచ్చోడ: చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గురువారం ఆదివాసీ మహిళ సంఘాల నాయకులు ఎస్సై నరేష్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేసి ఉరితీయాలన్నారు.

అట్టహాసంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్ అర్బన్, సెప్టెంబరు 12: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. ఎంపిక పోటీలకు ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ గౌస్ఆలం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అథ్లెటిక్స్ వల్ల దేహదారుడ్యంతో పాటు క్రమశిక్షణ పెంపొందుతుందన్నారు. క్రీడాకారులందరూ నిజమైన క్రీడాస్ఫూర్తిని చాటి పోటీల్లో ఉత్తమప్రతిభను కనబర్చాలని ఆకాంక్షించారు. స్నేహపూర్వకమైన వాతావరణంలో పోటీలు జరగాలన్నారు. అనంతరం జెండా ఊపి ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఇందులో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రాజేశ్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథ, పెటా సంఘం ప్రధాన కార్యదర్శి ఎన్.స్వామి, పీడీలు, పీఈటీలు, కోచ్‌లు, జిల్లాలోని వివిధ పాఠశాల నుంచి 600 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు.

పిప్పల్‌కోటి హత్యకేసులో ఇద్దరి రిమాండ్

భీంపూర్, సెప్టెంబరు 12 : భీంపూర్ మండలం పిప్పల్‌కోటికి చెందిన జనకొండ నారాయణ అనే వ్యక్తి మృత దేహం మహారాష్ట్ర పిప్పల్‌గావ్ అటవీ ప్రాంతంలో కనిపించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వివరాలను మహారాష్ట్ర మాండ్వీ పోలీసులు గురువారం వెల్లడించారు. వారు తెలిపిన ప్రకారం.. జనకొండ నారాయణ ఈ నెల 5న సరుకులు తెస్తానని ఇంటి వద్ద చెప్పి ఆదిలాబాద్ బయలుదేరాడు. అక్కడ పిప్పల్‌కోటికి చెందిన మారెట్టి వినోద్, దేవన్నలు నారాయణను నమ్మించి మోటార్ సైకిల్‌పై తలమడుగు మండలం సుంకిడికి తీసు కెళ్లారు. అక్కడ నారాయణకు మద్యం తాగించారు. తరువాత అక్కడి నుంచి మహారాష్ట్ర పిప్పల్‌గావ్ వెళ్లి అక్కడ కూడా మద్యం తాగించారు. తరువాత అడవిలో నారాయణను వీరిద్దరూ నెట్టివేయగా పెద్దబండ రాళ్ళపై పడి తీవ్ర రక్త స్రావమై స్పృహ కోల్పోయాడు. అప్పుడు దేవన్న, వినోద్‌లు చాకులతో పొడిచారు. అనంతరం నారాయణపై పెట్రోల్‌పోసి తగలబెట్టారు. కాగా మాండ్వీ పోలీసులు ఈనెల 7న పిప్పల్‌గావ్ అడవిలో గుర్తు తెలియని మృత దేహంగా కేసునమోదు చేశారు. అప్పటికే భీంపూర్ మండలం పిప్పల్‌కోటిలో ఒక వ్యక్తి మిస్సింగ్ విషయం తెలుసుకున్న మాండ్వీ పోలీసులు పిప్పల్‌కోటి నుంచి వారి కుటుంబాన్ని పిలిపించారు.

మృతదేహానికి చేతికున్న రాకీ, కాలిలోని రాడ్‌లను బట్టి అది తన భర్త మృత దేహం అని భార్య విజయలక్ష్మీ ధృవీకరించింది. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి మాండ్వీ పోలీసులు హత్య కేసు ఛేదించారు. పిప్పల్‌కోటికి వచ్చి విచారణ చేపట్టారు. కాగా వివాహేతర సంబంధంతోనే ఈ హత్య జరిగిందని తెలుస్తోంది. ఎట్టకేలకు గురువా రం వినోద్, దేవన్నలను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో సీఐ షేక్ గఫార్, ఎస్ఐ అమల్ మాస్కే, ఎస్ఐడీ శ్యాంచౌహాన్, క్రైం బ్రాంచ్ అధికారులు వేగంగా స్పందించి కేసు మిస్టరీ ఛేదించారు.

పెన్‌గంగలో గుర్తుతెలియని శవం

జైనథ్, సెప్టెంబరు 12: జైనథ్ మండల సరిహద్దున గల డొల్లార సమీపంలో గల పెన్‌గంగా నదిలో గురువారం మధ్యాహ్నం గుర్తుతెలియని శవం నదిలో కొట్టుక వచ్చింది. శవాన్ని పరిశీలించిన డొల్లార గ్రామస్థులు జైనథ్ మండల పోలీసులకు సమాచారం అందజేశారు. మృతదేహంపై తెల్లని దుస్తులు ఉన్నాయి. మృతదేహం నాలుగు రోజుల క్రితం వరదలో కొట్టుకు వచ్చిందని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న జైనథ్ మండల ఎస్సై వి.పురుషోత్తం సంఘటన స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.